క్లుప్తంగా

లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్



నిరసనలో పాల్గొన్న చిల్లర వర్తకులు

సీతంపేట : కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కార్మిక వర్గంపై పనిభారం పెంచుతూ, కనీస వేతనాలు అమలు చేయకుండా కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా అక్కయ్యపాలెం నరసింహనగర్ రోడ్‌లో చిల్లర వర్తకులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి పని భారం పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ రోజువారీ ఆశీలు వసూలు పేరుతో చిల్లర వర్తకులపై మోపుతున్న ఆర్థిక భారం రద్దు చేయాలని కోరారు. నాయకులు రావికృష్ణ, పి.సాయికుమార్, జి.శ్రీనివాస్, కె.ప్రకాష్, మహాలక్ష్మి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ కవితా పఠనం

సీతంపేట : గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖ సాహితి ఆధ్వర్యంలో శ్రీలలితాపీఠంలో స్వీయకవితా పఠనం నిర్వహించారు. సభాధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ దేశమంతటా 76వ గణతంత్ర దినోత్సవాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి, రచయిత కరణం సత్యనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రచయితలు సోమంచి వినయభూషణరావు, ఎ.ప్రసాద్, పిల్లా వెంకట రమణమూర్తి, రామరాజు విశాలాక్షి, నాగుల శ్రీనివాస్, జి.ఇందిర, కె.పాండురంగ విఠల్ మూర్తి, చిన సూర్యనారాయణ, భీమేశ్వరరావు తదితరులు స్వీయ కవితా పఠనం చేశారు.

సీతమ్మధారలో గుడి కూల్చివేత సబబే

- ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార : సీతమ్మధారలో గుడి కూల్చివేయడం సరైన చర్యే అని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి గుడి నిర్మిస్తే తప్పే అన్నారు. రోడ్డు మీద కట్టేసిన దేవాలయం కూల్చివేయడం కరెక్టే అని ఆయన అన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి గుడి, చర్చి, మసీదు... ఏది కట్టినా కూల్చేయడం సబబే అని స్పష్టం చేశారు. ఈ ఆక్రమణ గురించి తన దృష్టికి కూడా గతంలో వచ్చిందని ఆయన గుర్తు చేశారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు


సీతమ్మధారలో చికెన్ విక్రయిస్తున్న దుకాణం

సీతమ్మధార : రిపబ్లిక్ డే సందర్భంగా జీవీఎంసీ పరిధిలో ఏటా మాంసం దుకాణాలకు సెలవు ప్రకటిస్తారు. కానీ ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల పలు ప్రాంతాల్లో చికెన్, మటన్ షాపులు యథేచ్ఛగా తెరిచి వ్యాపారాలు చేస్తున్నా సరే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆదివారం కావడంతో అధికారులు ఇళ్లకు పరిమితమయ్యారో ఏమోగానీ మాంసం వ్యాపారులు రెచ్చిపోయి మరీ విక్రయాలు చేయడం గమనార్హం. వ్యాపారులు ఇంతగా బరితెగించి నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయాలు చేస్తున్నా అధికారులు జాడలేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, తదితర ప్రాంతాల్లో మటన్, చికెన్ దుకాణాలు తెరిచి దర్జాగా వ్యాపారాలు సాగించారు. జోన్ – 3 పరిధిలో ఎన్ని కేసులు నమోదు చేశారని ఏఎంహెచ్‌వోని 'సాక్షి' వివరణ కోరగా జీవీఎంసీ పశువైద్యాధికారి డాక్టర్ కిశోర్‌ని అడగాలని చెప్పడం గమనార్హం.

ఘనంగా గణతంత్ర దినోత్సవం

రెపరెపలాడిన ముువ్వన్నెల జెండా

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో గణతంత్ర దినోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఎ.నిర్మల్ కుమార్ ప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ కె.లక్ష్మీపతి, శ్రీకాకుళం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకీరామ్, హెచ్‌వోడీలు కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, డాక్టర్ రత్నకుమార్, రాజేంద్రప్రసాద్, ఎస్‌వీ రమణ, పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

- కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ జాతీయ జెండా ఎగురవేశారు. మాధవధార ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.హేమలత, ఏఎస్‌ఆర్ కాలనీలోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎం సాయిలక్ష్మి జెండా ఆవిష్కరించారు.
- మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, పార్కు కార్యదర్శి పీఎస్‌ఎన్ రాజు, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.
- మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము జెండా ఆవిష్కరించారు. అనంతరం జెడ్సీ రామును క్లబ్ సభ్యులు సత్కరించారు.


జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ ప్రియ

సీతంపేట : లంకపల్లి బుల్లయ్య కళాశాలల అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.సి.రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఎన్‌సీసీ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాలు, ఎన్‌ఎస్‌ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.


బుల్లయ్య కళాశాలలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ప్రొఫెసర్ కేసీ రెడ్డి

- సీతంపేటలో గల జనసేన నగర కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 75 ఏళ్లలో భారతదేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఆర్థిక, సామాజిక, సాంకేతిక పురోగతి సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పౌరులంతా రాజ్యాంగ స్ఫూర్తితో బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. నాయకులు ఉషాకిరణ్, శ్యామల దీపిక, కార్పొరేటర్లు ఉష శ్రీ, కంటిపాము కామేశ్వరి, సారిపల్లి గోవింద్, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, శివాజీరాజు, రాంబాబు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

- సీతమ్మధారలోని లాన్సమ్ ఆక్సిజన్ టవర్స్‌లో ఏయూ ప్రొఫెసర్ ఆచార్య నాగభూషణరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు, కార్యదర్శి నంబూద్రి, కోశాధికారి రమణమూర్తి పాల్గొన్నారు.
- ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌లో 76వ గణతంత్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఆవరణలో సీఐ సత్యనారాయణ జాతీయ జెండా ఎగరవేశారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 49వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యనగర్ – 1లో శ్రీరామాంజనేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని అల్లు శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

- జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాలను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ నిర్వహించారు. ముందుగా జాతీయ జెండా ఎగురవేసి, జెండా వందనం చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రిపబ్లిక్ డే వేడుకల్లో సభ్యులు, నాయకులు

సీతమ్మధార : అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో గల శ్రీ కనకమహాలక్ష్మి సహకార బ్యాంకులో ఆదివారం గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు గోలి రామకృష్ణ జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు సాధించిన అభివృద్ధిని వివరించారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, మేనేజర్లు బి.ఆర్.చక్రవర్తి, రాజా గణేష్ శ్రీదేవి, రాజేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కంచరపాలెం : నేషనల్ పోర్ట్ ట్రస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో కైలాసపురం శాంతినగర్‌లో గొర్లె చందు జాతీయ పతాకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, మరిడయ్య, అప్పలనాయుడు, పీవీ రమణ, అప్పారావు, శాంతి, కృష్ణకుమారి, జీవీ రమణ, హేమంత్, తిరుపతిరావు పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు


జెండా ఎగురవేస్తున్న 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


జనసేన కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


కైలాసపురంలో జెండా ఆవిష్కరిస్తున్న గొర్లె చందు


కనక మహాలక్ష్మి సహకార బ్యాంకులో జెండా వందనం చేస్తున్న రామకృష్ణ

గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన


పాత రేసపువానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన చెత్త


గురుద్వార్ ప్రధాన రోడ్డులోని గెడ్డలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలో ఏటా వర్షాకాలం ముందు గెడ్డల సుందరీకరణ కోసం రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ప్రస్తుతం ఏ గెడ్డలో చూసినా చెత్త, వ్యర్థాలు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. జోన్ – 3 పరిధి 14వ, 24వ వార్డు పాత రేసపువానిపాలెం, గురుద్వార్ జంక్షన్‌లోని జాతీయ రహదారి పక్కన గల గెడ్డలన్నీ చెత్త, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇక్కడి సచివాలయం రోడ్డులో గల గెడ్డలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది మలేరియా జ్వరాలు సోకుతున్నాయని హడలిపోతున్నారు. పలు ప్రాంతాల నుంచి మురుగునీరు, వర్షపు నీరు ఈ గెడ్డలోకి వస్తుంది. కానీ నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కనే సచివాలయం ఉన్నా శానిటేషన్ కార్యదర్శి కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలోనే ఉన్నా సూపర్‌వైజర్ కూడా గెడ్డల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. కోడిమాంసం వ్యాపారులు కూడా వ్యర్థాలను యథేచ్ఛగా గెడ్డలోనే పడేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రజలు కూడా ఇళ్లలోని చెత్తను గెడ్డలోనే వేయడం గమనార్హం. రేసపువానిపాలెం నుంచి ఈ గెడ్డ ద్వారా కేఆర్‌ఎం కాలనీ మీదుగా వెళ్లే మురుగునీరు చెత్త వల్ల ఎక్కడికక్కడ నిలిచిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వార్డులోని గెడ్డలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానానికి విశేష స్పందన


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

మురళీనగర్ : మురళీనగర్ సెక్టార్ – 3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో విశాఖపట్నం వివేకానంద యువ మహామండలి, ఆధ్యాత్మిక పార్కు సంయుక్త ఆధ్వర్యంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా వివేకానందుడి విగ్రహానికి ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ ఎం.సూర్యతేజ, పార్కు అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రిటైర్డ్ ఎయిర్‌ఫోర్సు అధికారి డాక్టర్ సోమనాథ్ సాహు పాల్గొని భారతదేశం అభివృద్ధికి యువత నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా 28 మంది యువకులు రక్తదానం చేశారు. వీరికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో పార్కు అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, జీవీ రత్నం, వీవీవైఎం అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పి.చంద్రశేఖర్, వీవీవైఎం సభ్యులు పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు.

మిషన్ వాత్సల్య పోస్టులకు 55 దరఖాస్తులు

ఎంవీపీ కాలనీ : జిల్లా మహిళ, శిశు సంక్షేమం, సాధికారత శాఖ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలో ఖాళీగా ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పోస్టులకు 55 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఆ శాఖ కార్యాలయం ప్రొటక్షన్ ఆఫీసర్, డాక్టర్ (పార్ట్‌టైం), ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 18వ తేదీతో దరఖాస్తు గడువు ముగియగా మూడు పోస్టులకు కలిపి 55 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ పీడీ జయదేవి వెల్లడించారు. ప్రొటక్షన్ ఆఫీసర్ పోస్టుకు 42 మంది, డాక్టర్ పోస్టుకు 2, ఆయా పోస్టుకు 11 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అర్హతలు ఆధారంగా దరఖాస్తులను 1:10 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేయనున్నట్లు తెలిపారు. మరో వారంలో అర్హులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

రౌడీషీటర్లు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆత్మకూరు సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై నిఘా పెట్టామని గుర్తు చేశారు. మద్యం సేవించి షాపులు వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటామని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- సమాజంలో అల్లర్లు సృష్టించకుండా, ప్రశాంతంగా జీవించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ డి.వి.రమణ సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు పోలీస్‌ల నిఘా ఉంటుందని, ప్రశాంతంగా జీవించాలని సూచించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ

టీవీ దొంగిలించిన ఇద్దరికి రిమాండ్

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో దొంగతనానికి గురైన టీవీ లభ్యమైంది. దొంగతనం చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని టీవీ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 11వ వార్డు పరిధి పార్వతినగర్‌లో నివసిస్తున్న బి.సంతోష్‌కుమార్ కుటుంబంతో ఈ నెల 14న ఉదయం సంక్రాంతికి సొంత ఊరు బొబ్బిలి వెళ్లారు. ఈ నెల 18న ఇంటి యజమాని ఫోన్ చేసి తలుపులు తాళాలు తీసి ఉన్నాయని, ఇంట్లో దొంగలు పడినట్లు ఉందంటూ తెలియజేశారు. దీంతో అదే రోజు ఆయన బొబ్బిలి నుంచి పార్వతినగర్ చేరుకున్నారు. ఇంట్లో పరిశీలించగా 32 ఇంచీల టీవీ కనిపించకపోవడంతో దొంగలు టీవీ పట్టుకుపోయారని ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ఆదర్శనగర్‌కు చెందిన కె.గోవిందరాజు, గాంధీనగర్‌కు చెందిన పి.రఘుతోపాటు మరో బాలుడు ఇంట్లో దొంగతనానికి పాల్పడి టీవీ పట్టుకుపోయినట్లు గుర్తించారు. దీంతో రెండు రోజుల క్రితం వారిని క్రైం ఎస్ఐ ఎ.హరికృష్ణ, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి టీవీ స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌ల చోరీతో వాహనచోదకుల బేజారు

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలు పెరిగిపోతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి పూట ఇళ్ల ఎదురుగా, రోడ్డు మీద పార్కింగ్ చేసిన వాహనాలు చోరీకి గురవుతున్నాయని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు. ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు కూడా నిందితులను పట్టుకోలేక, వాహనాలను రికవరీ చేయలేక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్ పరిధిలో గల సంగమ్, శరత్ థియేటర్, రైల్వేస్టేషన్, రైల్వే న్యూ కాలనీ, ద్వారకానగర్, దొండపర్తి, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. వారంలో కనీసం రెండు ఫిర్యాదులు వస్తున్నాయని తెలుస్తోంది. రాత్రిపూట పోలీసుల గస్తీ అంతంతమాత్రంగానే ఉండడం కారణంగానే ద్విచక్రవాహనాల చోరీలు బాగా పెరిగిపోయాయని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. స్థానిక దొంగలే ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ దొంగలు కూడా ఎక్కడో ఒక చోట ఈ వాహనాలు వదిలేసి పరారవుతున్నారని తెలుస్తోంది. మరోవైపు వాహనాలు పోగొట్టుకుని స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వస్తున్న బాధితుల వద్ద క్రైం పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ చోరీ కేసులకు తోడు ద్విచక్రవాహనాల చోరీ కేసులను కూడా పోలీసులు సకాలంలో రికవరీ చేయలేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

సీతమ్మధార / బీచ్‌రోడ్డు : ఆశీలుమెట్ట దరి సీబీఎం కాంపౌండ్‌లోని టింపనీ స్కూల్ సమీపంలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైందని పోలీసులకు సమాచారం అందింది. ఆ సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.సురేష్ కుమార్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మృతుని వయసు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. అంతకు మించి ఆధారాలు లభించలేదని, సంబంధీకులు 7995095321లో సంప్రదించాలని కోరారు. అనంతరం మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.


ఘటనా స్థలిలో యువకుడి మృతదేహం

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపి, 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.